




# మన దునియా

Our News Our World

RNI Number
TELTEL/2023/85680


మన అక్షరం - మన ప్రపంచం



సంపుటి : 3 | సంచిక : 250 | మార్చ్ 29 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# కలెక్టర్ గారు ఇటు చూడండి..




- ప్రభుత్వ వేతనం .. ప్రైవేట్ సేవలు
- షాద్‌నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మిపై విచారణ
- విచారణ పేరిట 'అధికారుల' కంటితుడుపు చర్యలు
- బుక్ ఎలా బయటకు వచ్చింది..?
- విచారణ అధికారుల కొత్త డౌట్..!
- విచారణ సగం ముగిసింది - ఇంకా సగం విచారించాలి
- విచారణలో ఒకరిపై మరొకరు పరనింద పారాయణం

**మన దునియా,షాద్‌నగర్,మార్చి 28**

ప్రభుత్వ వైద్య రంగాన్ని పటిష్టం చేయాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, సొంత వ్యాపారాల కోసం విధులకు గైర్హాజరవుతూ, అటెండెన్స్ రిజిస్టర్‌లో 'ప్రాక్సీ' సంతకాలతో మాయాజాలం చేస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ డివిజన్




## తెలంగాణ అసెంబ్లీలో వృద్ధ తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా బిల్లు!

**మన దునియా,హైదరాబాద్:మార్చి 28**

తెలంగాణ రాష్ట్రంలోని వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ యోగక్షేమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక బిల్లు సిద్ధం చేసింది, శనివారం శాసన సభలో తెలంగాణ ఉద్యోగుల జవాబుదారీ తనం పర్యవేక్షణ బిల్లు 2026 ను ప్రవేశపెట్టనుంది... దీంతోపాటు..తెలంగాణ ప్రభుత్వం. సింగరేణి 103, 104వ వార్షిక రిపోర్ట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టను న్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఆ తర్వాత.. తెలంగాణ పంచాయతీ రాజ్-2026 అమెండ్మెంట్ బిల్లును మంత్రి సీతక్క సభలో ప్రవేశపెడతారు. వృద్ధ దంపతులకు ఆర్థిక భరోసా



## లాక్ డౌన్ ప్రసక్తే లేదు?

**మన దునియా,హైదరాబాద్:మార్చి 28**

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా మళ్లీ లాక్‌డౌన్ విధిస్తారంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ స్పష్టం చేశారు. దేశంలో ఇంధన కొరత ఏర్పడవచ్చు నే ఆందోళనల



## మూసీ నది తీరాన ఓంకారేశ్వర ఆలయం

### ఆలయ నిర్మాణానికి నేడు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన!

**మన దునియా,హైదరాబాద్:మార్చి 28**

మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి పనులకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా తొలి అడుగుగా, గండిపేట మండలం మంచిరేవులలో భారీ ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి ఈరోజు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,శంకుస్థాపన చేయనున్నారు. మూసీ తీరాన్ని మత సామరస్యానికి కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఈ బృహత్కార్యాన్ని



## ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతి!

### అమరావతికి చట్టబద్ధత కల్పించాలని అసెంబ్లీలో సీఎం చంద్రబాబు తీర్మానం

**మన దునియా,అమరావతి:మార్చి 28**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం శనివారం ఉదయం ప్రారంభమైంది, ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లును ప్రవేశపెట్టారు. ఉదయం సరిగ్గా 11 గంటల 11 నిమిషాలకు శాసనసభలో ఈ బిల్లును సీఎం ప్రవేశపెట్టడంతో తీర్మానంపై చర్చ మొదలైంది,



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## తెలంగాణ అసెంబ్లీలో వృద్ధ తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా బిల్లు!

బిల్‌ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అసెంబ్లీలోప్రవేశపెడతారు. 2026-27 బడ్జెట్ గ్రాంట్స్, ట్రాన్స్‌పోర్ట్ అడ్మినిస్ట్రేషన్. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖకు పద్దుల కేటాయింపుపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం ఇవ్వనున్నారు. ఇక.. గ్రామీణాభివృద్ధి, నీటి పారుదల, స్త్రీ శిశు సంక్షేమశాఖకు పద్దుల కేటాయింపుపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానం ఇస్తారు. ఇదిలా ఉంటే.. ఇవాళ, రేపు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ క్రీడా పోటీల్లో తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు.

## ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతి!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం అమరావతిని రాజధానిగా ఉంచడం అత్యవసరమని, మరియు ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రా నికి స్థిరత్వం వచ్చేలా చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తీర్మానంలో కేంద్రాన్ని రాజధానికి చట్టబద్ధత కల్పించమని కోరుతూ కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై స్పష్టత మరియు స్థిరత్వాన్ని ఏర్పరచడం ఈ తీర్మానం ప్రధాన ఉద్దేశ్యం.అమరావతి రాజధానిగా కొనసాగడానికి అవసర మైన అన్ని రక్షణాత్మక చర్యలను కూడా తీసుకోవాలని తీర్మానంలో ప్రత్యేకంగా పేర్కొన్నారు సీఎం చంద్రబాబు... ఇది భవిష్యత్తులో రాజధాని పనులు, సౌకర్యాలు, భద్రతా విధానాలకు మద్దతుగా ఉంటుంది. అలాగే, రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 5(2)లో సవరణలు చేసి రాజధాని స్థానం విషయంలో స్పష్టత మరియు స్థిరత్వాన్ని కల్పించవచ్చని మంత్రి సభలో వెల్లడించారు. ఈ తీర్మానం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త దిశను సూచించేలా ఉందని నిపుణులు వ్యాఖ్యానిస్తు న్నారు. మొత్తంగా, ఈ తీర్మానం అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తించడం ద్వారా రాష్ట్రానికి భవిష్యత్తులో స్థిరత్వం, అభివృద్ధి అవకాశాలు, మరియు కేంద్రీయ చట్టబద్ధత వంటి అంశాలకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా ఉంది. ఇక, ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పంచే విషయంలో చేయాల్సిన తీర్మానం ప్రవేశపెట్టడం.. దానిపై చర్చ కోసం ఈ రోజు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశమైన విషయం విదితమే.. సీఎం చంద్రబాబు తీర్మానం ప్రవేశపెట్టిన తర్వాత.. మంత్రులు, నేతలు దీనిపై మాట్లాడుతున్నారు..

## మూసీ నది తీరాన ఓంకారేశ్వర ఆలయం

(మొదటి పేజీ తరువాయి)

చేపడుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక ప్రకారం పశ్చి మాన జంట జలాశయాల నుంచి తూర్పున ప్రతాపసింగారం వరకు 55 కిలోమీటర్ల పొడవున మూసీ అభివృద్ధి పనులు జరగనున్నాయి. ఇందులో భాగంగా మంచిరేవులలో ఆలయంతో పాటు.... పురానాపూల్ వద్ద భారీ మసీదు, గౌలిగూడలో గురుద్వారా, నాగోల్‌లో చర్చి నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించారు. మంచిరేవులలో 800 ఏళ్ల వీరభద్రస్వామి, 1400 ఏళ్ల మచిలేశ్వర ఆలయాల సమీపంలో 8 ఎకరాల విస్తీర్ణంలో ఈ కొత్త ఆలయాన్ని నిర్మిస్తున్నారు. కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సలహాలతో ఆలయ నిర్మాణ శైలిని ఖరారు చేశారు. 64 అడుగుల ఎత్తుతో నిర్మించే దీని గర్భాలయం, యాదాద్రి తర్వాత రాష్ట్రంలో రెండో అతిపెద్దదిగా నిలవనుంది.ఈ ప్రాజెక్టులో భాగంగా ఆలయం వద్ద 2,000 వాహనాల పార్కింగ్, ఓఆర్ఆర్ నుంచి విశాలమైన రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే, మూసీ నదిపై చిన్న ఆనకట్ట నిర్మించి, నీటిని నిల్వ చేస్తారు. నది మధ్యలో ఏర్పాటు చేసే ఓ దీవిపై 100 అడుగుల శివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించ డంతో పాటు, బోటింగ్ సౌకర్యం, పార్కులను కూడా అభివృద్ధి చేయనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.700 కోట్లు గా అంచనా వేస్తుండగా, నిధుల సమీకరణకు దాతలు, ప్రైవేటు సంస్థల సహకారం తీసుకోనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈరోజు ఉదయం 8:30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి శృంగేరి పీఠాధిపతులు హాజరుకానున్నారు.

## ఏప్రిల్ 6 వ తేదీ లోపు అప్లై చేసుకోండి -- జర్నలిస్టులకు అక్రెడిటేషన్ గడువు



**మన దునియా,హైదరాబాద్,మార్చ్ 28:**

తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డుల కోసం ఏప్రిల్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక సూచించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆమె పలు వివరాలు వెల్లడించారు.జర్నలిస్టులు తమ యాజమాన్యాల నుంచి పొందిన సిఫార్సు లేఖతో పాటు అవసరమైన పేపర్ కటింగులు విద్యార్హతల సర్టిఫికెట్లు ఇండిపెండెంట్ జర్నలిస్టులు కటింగ్లతో పాటు సంబంధిత ఎడిటర్ పత్రికకు వార్తలు రాసినట్లు ధ్రువీకరించే లేఖ సంబంధిత అర్హత పత్రాలను జత చేయడంతో పాటు తాము వేరే ఇతర వృత్తులలో అనగా సొసైటీ చైర్మన్, డైరెక్టర్ ప్రభుత్వ ఉద్యోగం, న్యాయవాద వృత్తి, సర్పంచ్ తదితర ఇతరత్రా ఏ పద పదవుల్లో కొనసాగడం లేదని సెల్ఫ్ డిక్లరేషన్ జతచేసి హార్డ్ కాపీని సంబంధిత డిపిఆర్ఓ కార్యాలయాలలో అందజేయాలని, అప్లికేషన్‌ను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై సంబంధిత అధికారులకు కఠిన చర్యలకై ఆదేశాలు ఇవ్వనున్నట్లు స్పెషల్ కమిషనర్ వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ రెండు సార్లు సమావేశమై జీఓ అమలు, విధి విధానాలపై చర్చించిందని, అందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను సమీక్షిస్తూ, అర్హత ప్రమాణాలు పూర్తి చేసిన జర్నలిస్టులకు కార్డులు జారీ చేసే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# లాక్ డౌన్ ప్రసక్తే లేదు?

నడుమ, ప్రజలను గందరగోళానికి గురిచేసే ఇలాంటి వదంతులను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

**లాక్‌డౌన్ ప్రతిపాదనే లేదు..! ఆర్థిక మంత్రి నిర్మలమ్మ!**

ఇంధన సరఫరాలో అంత రాయం ఏర్పడుతుందన్న భయంతో పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరుతున్నారు. ఈ ఉద్రిక్త పరిస్థితులపై ఆర్థిక మంత్రి సీతారామన్ రాజ్యసభలో ఆర్థిక బిల్లు 2026 పై చర్చకు సమాధానం ఇస్తూ... అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న మాట నిజమే. ఎనర్జీసప్లై చైన్, నిత్యావసరాల రవాణాను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోంది. దేశంలో ఇంధన నిల్వలు పుష్కలం గా ఉన్నాయి. లాక్‌డౌన్ విధించే ఆలోచన గానీ అలాంటి ప్రతిపాదన గానీ ప్రభుత్వం వద్ద లేదు. ఇలాంటి అసత్య ప్రచారాలు సమాజానికి హాని కలిగిస్తాయి అని ఆమె అన్నారు.గత నెల రోజుల్లో అంతర్జా తీయ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి ఏకంగా 122 డాలర్లకు చేరింది. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు 20 నుంచి 50 శాతం మేర పెరిగాయి. అయితే భారత్‌లో సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని కేంద్ర ఆర్థిక ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ వివరించారు. పెట్రోల్‌పై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని రూ.13 నుంచి రూ.3కు తగ్గించడమే కాకుండా.. డీజిల్‌పై ఉన్న రూ.10 సుంకాన్ని పూర్తిగా ఎత్తివేస్తూ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుందన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గినప్పటికీ.. చమురు కంపెనీలకు, ప్రజలకు భారీ ఊరట లభించనుంది.

# నేడే బిల్లు.. ఇక తల్లిదండ్రులను చూసుకోకపోతే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల జీతాల్లో కోతలు పక్కా..

**మన దునియా హైదరాబాద్ మార్చి 28**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత సమాజంలోని ఓ కీలక సమస్యకు స్వస్తి చెప్పేందుకు ముందడుగు వేసింది. తల్లిదండ్రులకు ఓ వయసు వచ్చాక పిల్లలే తోడుండాలి. కానీ.. ప్రస్తుతం చాలా మంది వయోవృద్ధులైన తల్లిదండ్రులను అనాథలుగా వదిలేస్తున్నారు. ఈ విధనాన్ని రూపుమాపాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ, యోగక్షేమాల కోసం రాష్ట్రప్రభుత్వం బిల్లు సిద్ధం చేసింది. నేడు (శనివారం) అసెంబ్లీలో 'తెలంగాణ ఉద్యోగుల జవాబుదారీతనం, పర్యవేక్షణ బిల్లు-2026'ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లుతో ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు పొందుతున్న ఉద్యోగులు ఒకవేళ పేరెంట్స్‌ను పట్టించుకోకుంటే వారి జీతం నుంచి 15 శాతం కట్ చేసి తల్లిదండ్రుల అకౌంట్‌లో జమ చేస్తారు. ఈ బిల్లు కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే పరిమితం కాలేదు. ప్రైవేటుసంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం తల్లిదండ్రులను పట్టించుకోకుంటే తమ వేతనంలో నెలకు 15 శాతం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. జిల్లాల్లో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారుల(జిల్లా కలెక్టరు)కు కారణాలు వివరిస్తూ దరఖాస్తు చేసుకుంటే ఆ అధికారి పరిశీలించి దరఖాస్తును పరిష్కరిస్తారు. తరువాత ఉద్యోగి వేతనం నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు.. ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని తల్లిదండ్రులకు భృతిగా అధికారి నిర్ణయిస్తారు. ఈ



బిల్లు ప్రకారం.. ఎలాంటి ఆధారం లేని తల్లిదండ్రులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. తల్లి లేదా తండ్రి అవసరమైతే ఇద్దరూ జిల్లా స్థాయిలో ప్రభుత్వం నియమించిన అధికారితో చర్చించి దరఖాస్తు సమర్పించాలి. ఈ దరఖాస్తును పరిశీలించి 60 రోజుట్లోగా సమస్యను పరిష్కరిస్తారు. తరువాత ఉద్యోగి జీతం నుంచి నిర్దేశించిన మొత్తాన్ని మినహాయించి తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఆదేశాలివ్వాలి. ఒక వేళ అధికారి పట్టించుకోకుంటే, సమస్యను గడువుల లోపు పరిష్కరించకుంటే మరో మార్గం సైతం ఉంది. రాష్ట్ర స్థాయిలోని హైకోర్టు విశ్రాంత జడ్జీ కమిషనర్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు అప్పీలు చేసే అవకాశం ఉంది.

# కలెక్టర్ గారు ఇటు చూడండి..

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మిపై విచారణ మొదలైంది. శనివారం షాద్‌నగర్‌కు ఈ వ్యవహారం విచారణ నిమిత్తం వచ్చిన రంగారెడ్డి జిల్లా వైద్యశాఖ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ షఫీ, సూపరిండెంట్ మల్లికార్జున్‌లు వచ్చారు. షాద్ నగర్ డిప్యూటీ డిఎంఎన్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ రిజిస్టర్ లో నెలసరి సంతకాలు ఒకేసారి పెట్టుకోవడం, ప్రైవేటు ఆసుపత్రులకు ప్రచారం చేయడం, మీడియా మంచి కవరేజ్ ఇవ్వాలంటూ నివేదించడం తదితర సంఘటనలను ఉటంకిస్తూ వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఆయా పత్రికల్లో సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించారు. ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా వైద్యశాఖ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ షఫీ, సూపరిండెంట్ మల్లికార్జున్ లు వచ్చారు. విచారణ చేపట్టిన అధికారుల విచారణలో సగమే విచారణ జరిగింది.. మరి కొంత విచారణ జరగాలి అంటూ మీడియాకు చెప్పిన విచారణ అధికారుల తీరు పలు అనుమానాలకు తావిస్తోంది.

విచారణా? లేక కాలయాపనా?

వైద్య శాఖలో అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన డాక్టర్ విజయలక్ష్మి విధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాల్సిన అధికారులు, బాధ్యతాయుతమైన సమాధానం చెప్పకుండా దాటవేత ధోరణి ప్రదర్శించడం విస్మయానికి గురిచేసింది. ఎంక్వయిరీలో ఏం తేలిందని ప్రశ్నించిన మీడియా ప్రతినిధులకు, "సగమే విచారణ చేశాం.. ఇంకా బాకీ ఉంది.. కలెక్టర్ ఆఫీసులో అర్జెంట్ మీటింగ్ ఉంది" అంటూ సమాధానం ఇచ్చి వెళ్ళిపోవడం గమనార్హం. మళ్ళీ ఎప్పుడు వస్తారంటే "చూస్తాం" అనే మొక్కుబడి సమాధానంతో అధికారులు జారుకోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు వెనకాడుతున్నారా? అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసలు నిజాన్ని వదిలి.. సాక్ష్యాన్ని పట్టుకున్న వైనం!

ఈ తతంగంలో విశ్వసనీయ సమాచారం ప్రకారం.. విచారణకు వచ్చిన అధికారులు డాక్టర్ విజయలక్ష్మి చేసిన 'ప్రాక్సీ' సంతకాలపై కాకుండా, "అటెండెన్స్ రిజిస్టర్ బయటకి ఎలా వెళ్ళింది?" అనే అంశంపైనే ఎక్కువ ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. రామాయణంలో పిడకల వేటలా విచారణ మారబోతుందని అర్థమవుతుంది. అంటే, జరిగిన తప్పును సరిదిద్దడం కంటే, ఆ తప్పును బయటపెట్టిన వారిని వేటాడటమే లక్ష్యంగా అధికారులు పని చేస్తున్నారా? అన్న అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది. కళ్ళకు కట్టినట్లుగా అక్రమాలు కనిపిస్తున్నా, సాక్ష్యాలను పక్కన పెట్టి విచారణ దిశను మళ్లించడం వెనుక ఉన్న మతలబు ఏమిటి? అధికారులంతా ఒక్కటే ఎవరికి ఏ అన్యాయం జరిగినా వాళ్ళ లోపల వాళ్ళు సర్దుకుంటారనేదానికి ఇది నిదర్శనం కాబోతుందా అన్న అనుమానాలు కూడా నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వైద్యశాఖ పై దృష్టి సారించాల్సిన అవసరం స్వయంగా ఉంది. విధులను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న అధికారులపై చర్యలు తీసుకోకపోతే మిగతా ప్రాంతాల్లో కూడా ఇదే వరసగా మారుతుంది.

ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు..

తెలంగాణ ప్రభుత్వం విద్య మరియు వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ, సామాన్యుడికి మెరుగైన వైద్యం అందాలని కోరుకుంటుంటే, ఇలాంటి ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల వ్యవస్థ పరువు పోతోంది. విధులకు 'డుమ్మా' కొడుతూ ప్రభుత్వ జీతం పొందుతున్న అధికారిణిపై చర్యలు తీసుకోకుండా, విచారణ పేరుతో కాలయాపన చేయడం ప్రజాప్రయోజనాలను దెబ్బతీయడమే. ఈ తథంగంపై మీడియా ఇంకా ఎక్కువ ఆధారాలు సేకరిస్తే ఏదో రకంగా వారిని వదిలించుకునే ప్రయత్నం నయానా భయానా చేసేందుకు కూడా వెనకాడడం లేదని అర్థమవుతుంది. ఈ వాస్తవాలను బయటకు తీసిన పాత్రికేయులు, ఇతర మీడియా ప్రతినిధులపై శాఖ పరంగా రిజిస్టర్ ఎలా వారి చేతికి చిక్కింది అన్న కోణంలో ఇబ్బందులకు గురిచేసే అవకాశాలు కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు రిజిస్టర్ బయటకు పొక్కిన ఘటనలో సిబ్బంది హస్తం ఉందా అనే కోణంలో కూడా విచారణ జరిగింది. మొదటిరోజు విచారణలో సదరు విభాగంలో పనిచేస్తున్న క్రింది స్థాయి సిబ్బందితో విచారణ అధికారులు దర్యాప్తు జరిపారు. వారితో వాంగ్మూలాన్ని రాయించుకున్నారు. రిజిస్టర్ మీడియాకు ఎవరు అందించారు..? రిజిస్టర్ ఎవరైనా ఇచ్చారా లేక వారే స్వయంగా తీసుకున్నారా? రిజిస్టర్ కు సంబంధించి విచారణ మరొకనలో కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అసలు అధికారి చేసిన నిర్వాకాన్ని దర్యాప్తు బృందం పక్కదారి పట్టించినట్లు అర్థమవుతుంది. త్వరలో పూర్తి వివరాలతో..

# తెలంగాణ ప్రజలకు చల్లని కబురు.. వచ్చే మూడ్రోజులు వర్షాలు, ఈ జిల్లాలకు అలర్ట్

మన దునియా,హైదరాబాద్: మార్చి 28



తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణశాఖ చల్లని కబురు చెప్పింది. రాష్ట్రంలో నేటి నుంచి మూడ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయని చెప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.నేటి నుంచి మార్చి 30 వరకు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉరుములు, మెరుపులతో పాటు పలు ప్రాంతాల్లో పిడుగులు కూడా పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.భారీ వర్షాలకు తోడు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. హైదరాబాద్ నగరంలో నేడు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని చెప్పారు. సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

దంచికొడుతున్న ఎండలు..

ఓ వైపు వర్షాలు కురుస్తున్నా.. మరోవైపు భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శుక్రవారం (మార్చి 27) హైదరాబాద్ నగరంలోని రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలు ప్రాంతాల్లో 39 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. తీవ్ర ఎండలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నం 12 గంటలు అయితే చాలు నిప్పుల వర్షం కురిసినట్లుగా అనిపిస్తోంది. దీంతో ప్రజలు ఇంటికే పరిమితమై ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు సూచిస్తున్నారు. తీవ్రమైన ఎండలతో పాటు వడగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. పగలు ఎండలు దంచికొట్టగా.. సాయంత్రానికి వాతావరణం చల్లబడి పలు ఏరియాల్లో వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం నగరవాసులకు ఆహ్లాదాన్ని కలిగించింది. తీవ్ర ఉక్కపోతతో అల్లాడుతున్నవారికి ఉపశమనం కలిగించింది. నేడు కూడా సాయంత్రం తర్వాత నగరంలో వర్షం కురిసే అవకాశం ఉండటంతో వాతావరణం చల్లబడనుంది.

# కూరగాయల రైతులకు కిసాన్ ఐడీ కార్డులు

**ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు సర్కారు నిర్ణయం**

**రూ.215 కోట్లతో ప్రోత్సాహకాలు**

**50 శాతం సబ్సిడీతో పందిళ్లు, పరికరాలు**

**సాగుకు రుణాలు.. పంటకు మార్కెటింగ్**

**కోతుల బెడద నివారణకు సోలార్ ఫెన్సింగ్**

**వచ్చే ఐదేండ్లలో 2.50 లక్షల ఎకరాల విస్తరణ టార్గెట్**

మన దునియా,హైదరాబాద్: మార్చి 28

హైదరాబాద్ : రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కూరగాయలు పండించే రైతులకు ప్రత్యేక గుర్తింపు కల్పిస్తూ 'కిసాన్ ఐడీ కార్డులు' జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డుల ద్వారా రైతులకు సాగు రుణాలు, మార్కెటింగ్ సదుపాయాలు సులభతరం చేయడంతో పాటు పలు ప్రోత్సాహకాలు అందించనున్నారు. కూరగాయల సాగు అభివృద్ధి కోసం రూ.215 కోట్ల బడ్జెట్‌తో సమగ్ర ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసింది. రాష్ట్రాన్ని కూరగాయల స్వయం సమృద్ధిలో దేశంలోనే మోడల్‌గా నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో కంటే కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గిన నేపథ్యంలో దాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టింది. ప్రతి సంవత్సరం 50 వేల ఎకరాల చొప్పున కూరగాయల సాగును విస్తరించి, వచ్చే ఐదేండ్లలో మొత్తం 2.50 లక్షల ఎకరాలకు తీసుకెళ్లాలని హార్టీకల్చర్ డిపార్ట్‌మెంట్‌కు సర్కారు స్పష్టమైన లక్ష్యం నిర్దేశించింది. దీంతో రాష్ట్రం కూరగాయల స్వయం సమృద్ధిలో దేశంలోనే 'మోడల్ వెజిటబుల్ హబ్'గా ఎదగడానికి బలమైన అవకాశాలు ఏర్పడున్నాయి.

50% సబ్సిడీతో పందిళ్లు, పరికరాలు, ప్రోత్సాహకాలు

రైతులకు 50 శాతం సబ్సిడీతో పందిళ్లు, ఇతర పరికరాలను ఆర్‌కేవీవై, ఎమ్ఐడీహెచ్ పథకాల కింద అందించనున్నారు. హార్టీకల్చర్ డిపార్ట్‌మెంట్ పరిధిలో మినీ ట్రాక్టర్లు, తవ్వే యంత్రాలు సహా 17 రకాల యంత్ర పరికరాలకు సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయి. సెంట్రల్ స్కీమ్‌లను అనుసంధానం చేసి స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్, ప్లాస్టిక్ మల్చింగ్ పేపర్లు, నాణ్యమైన విత్తనాలు, పరికరాలు తదితరాలను సబ్సిడీ ధరల్లో అందజేస్తారు. ఆఫ్ సీజన్, ఎగ్జోటిక్ కూరగాయల సాగు, రసాయన అవశేషాలు లేని పంటలకు ప్రీమియం ధరలు లభించే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. టమాట, మిరప ఆధారిత ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు ద్వారా రైతులకు మరింత మద్దతు లభించనుంది. ప్రతి రైతు మరో ఐదుగురిని కూరగాయల సాగు వైపు మళ్లించేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో వెజిటబుల్ వలంటీర్లను తయారు చేసి గ్రామ స్థాయిలో ఉద్యమంగా సాగు విస్తరణకు ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్రంలో కోతుల బెడద కారణంగా కూరగాయల సాగు గణనీయంగా తగ్గింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు సోలార్ ఫెన్సింగ్, ఆధునిక టెక్నాలజీలను అందించనున్నారు. విజయవంతమైన రైతుల అనుభవాలను తెలియజేసేందుకు ఎక్స్‌పోజర్ విజిట్లు ఏర్పాటు చేస్తారు. అడవుల సమీపంలో తునికి, ఇరికి వంటి చెట్లను పెంచడం ద్వారా కోతులు పొలాల్లోకి రాకుండా నిరోధించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

ప్యాక్స్ రైతులకు హార్టికల్చర్ వర్సిటీ శిక్షణ

హార్టికల్చర్ వర్సిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 'కూరగాయల సాగు మహోద్యమం' నడపాలని సర్కారు భావిస్తోంది. శిక్షణ పొందిన రైతులు ప్రతి ఒక్కరు తమవంతుగా 10 నుంచి 15 మంది ఇతర రైతులను కూరగాయల సాగు వైపు మళ్లించాలని ప్రభుత్వం కోరుతోంది. విత్తనోత్పత్తి సంస్థను ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తక్కువ పెట్టుబడితో చిన్న చిన్న మెలకువల ద్వారా 30 శాతం అదనపు దిగుబడి సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ కార్యక్రమాలు విజయవంతం అయితే తెలంగాణలో కూరగాయల స్వయం సమృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలకు సరసమైన ధరల్లో నాణ్యమైన కూరగాయలు అందుతాయని హార్టీకల్చర్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

సాగుకు రుణాలు, పంటకు మార్కెటింగ్

కూరగాయలు పండించే రైతులకు కిసాన్ ఐడీ కార్డులు జారీ చేయడం ద్వారా సాగు రుణాలు, పంట మార్కెటింగ్ సౌకర్యాలు సులభంగా అందుతాయి. స్థానిక వనరులతో సేంద్రియ ఎరువులు తయారీపై శిక్షణ ఇచ్చి ఖర్చులు తగ్గించేందుకు చర్యలు తీసుకోనున్నారు. మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా దశలవారీగా సాగు చేయాలని, మల్టీ లేయర్ ఫార్మింగ్, సమగ్ర పురుగు నియంత్రణ, పోషక యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. పామ్ ఆయిల్ తోటల్లో అంతర పంటలుగా కూరగాయలు సాగు చేయాలని రైతులను ప్రోత్సహించనున్నారు. నాణ్యమైన నర్సరీ నారు వినియోగం, పంట మార్పిడి విధానాలు అమలు చేస్తారు. ఆఫ్ సీజన్, ఎగ్జోటిక్ కూరగాయలు, రసాయనాలు లేని సేంద్రియ కూరగాయలకు ప్రీమియం ధరలు లభిస్తాయని అధికారులు తెలిపారు.




## ఏప్రిల్ 1 నుండి కొత్త రూల్స్!

మన దునియా,హైదరాబాద్:మార్చి 28




కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంతో పాటు, ఇన్ కమ్ ట్యాక్స్ యాక్ట్ 2025 అమలులోకి రానున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా జీతభత్యాలు పొందే ఉద్యోగుల్లో ఆసక్తి, ఆందోళన వ్యక్తమవుతోంది. 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే కొత్త ఆదాయపు పన్ను నిబంధనలు పన్ను రేట్లను పెంచకపోయినా, జీత నిర్మాణాన్ని ప్రభావితం చేసే విధంగా కీలక మార్పు లను తీసుకువస్తున్నాయి. ఈ మార్పుల అమలు బాధ్యతను ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహించనుంది. నిపుణుల ప్రకారం.. ఉద్యోగుల మొత్తం కాస్ట్ టు కంపెనీ యథాతథంగా ఉన్నప్పటికీ, జీతంలోని భాగాల విభజనలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా, ఇప్పటివరకు పన్ను రహితంగా లేదా కొంత సడలింపుతో లెక్కించిన అలవెన్సులు, రీయింబర్స్‌మెంట్లు, ఇతర ప్రయోజనాలను కొత్త నిబంధనల ప్రకారం స్పష్టంగా పన్ను పరిధిలోకి తీసుకురానున్నారు. దీంతో ఉద్యోగుల పన్ను విధించదగిన ఆదాయం పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదే సమయంలో గతంలో అమలులోకి వచ్చిన కార్మిక చట్టాల ప్రభావం కూడా ఇప్పుడు స్పష్టంగా కనిపించనుంది. ఈ చట్టాల ప్రకారం ఉద్యోగి బేసిక్ జీతం మొత్తం సీటీసీ లో కనీసం 50 శాతం ఉండాలి. దీనివల్ల ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ లెక్కింపు లు పెరిగే అవకాశం ఉంది. అయితే దీని ప్రభావంగా ఉద్యోగుల చేతికి వచ్చే టేక్-హోమ్ జీతం కొంత తగ్గే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నా రు. అదనంగా కంపెనీ అందించే వివిధ సౌకర్యాలపై కూడా పన్ను విధింపు కఠినతరం అవుతోంది. కంపెనీ వసతి, వ్యక్తిగత ఉపయోగానికి ఆఫీస్ వాహనం, డ్రైవర్, గృహ సేవలు, యుటిలిటీ బిల్లులు, పిల్లల విద్య ఖర్చులు వంటి ప్రయోజనాలు ఇప్పుడు నిర్దిష్ట పరిమితిని మించితే పన్ను విధించదగిన ఆదాయంగా పరిగణించ బడతాయి. ఈ అంశాలకు సంబంధించి విలువ నిర్ణయ విధానాలను కూడా కొత్త నిబంధనలు స్పష్టంగా నిర్వచించాయి.

## హైదరాబాద్ కొత్త రూపం దాల్చిన ఐపీఎల్ బెట్టింగ్ దందా

మన దునియా,హైదరాబాద్: మార్చి 28



హైదరాబాద్: కొత్త రూపం దాల్చిన ఐపీఎల్ బెట్టింగ్ దందా ఐపీఎల్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో, క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్‌లో కూరుకుపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విడుదల చేసిన వీడియోలో, గతంలో నిషేధించిన బెట్టింగ్ యాప్‌లు ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా కొత్త రూపంలోకి మారాయని తెలిపారు. డబ్బు కోసం ఈ యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆన్‌లైన్‌తో పాటు ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో జరిగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై కూడా నిఘా ఉందని, బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా 94906 16555 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు

## మిడ్ మానేర్ గేట్లు ఎత్తివేత!

మన దునియా,రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి:మార్చి 28

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మం. కొదురుపాక మిడ్ మానేర్ రిజర్వాయర్ నీటిమట్టం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. శనివారం ఉదయం 6 గంటల నాటికి నీటి మట్టం 318 మీటర్ల పూర్తి స్థాయి సామర్థ్యానికి గాను 309.56 మీటర్ల వద్ద నమోదైంది.రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం 27.55 టీఎంసీలకు గాను ప్రస్తుతం 10.71 టీఎంసీల నీరు నిల్వగా ఉంది.ప్రస్తుతం రిజర్వాయర్‌కు ఎటువంటి ఇన్‌ఫ్లోలు లేవు. మరోవైపు అవుట్‌ఫ్లోలు మాత్రం కొనసాగుతున్నాయి. రిజర్వాయర్ నుంచి మొత్తం 2310 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో రైట్ గేట్ ద్వారా 1500 క్యూసె క్కులు, రైట్ మెయిన్ కాలువ ద్వారా 550 క్యూసెక్కులు, లెఫ్ట్ మెయిన్ కాలువ ద్వారా 5 క్యూసెక్కులు విడుదల అవుతుండగా.. ఆవిరీభవనం ద్వారా 210 క్యూసెక్కులు, మరో 45 క్యూసెక్కులు ఇతర మార్గాల ద్వారా బయటకు వెళ్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రస్తుతం 25 స్పిల్‌వే గేట్లలో 10 గేట్లు తెరిచి ఉంచారు. 9 నుండి 18 వరకు గేట్లు అర్ధ మీటర్ ఎత్తులో ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# జన్నారంలోని ఆదిత్య పిల్లల హాస్పిటల్ లో ఫైర్ సేఫ్టీ అవగాహన సదస్సు!





**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) మార్చ్:28.**

మంచిర్యాల జిల్లా, జన్నారం మండల కేంద్రంలోని ప్రముఖ "ఆదిత్య పిల్లల హాస్పిటల్" లో ఫైర్ సేఫ్టీ అవగాహన సదస్సు నిర్వహించారు. జన్నారం అగ్నిమాపక శాఖా సిబ్బంది మరియు ఆఫీసర్స్ పాల్గొని, హాస్పిటల్ లో అనుకోకుండా సంభవించే అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే ఫైర్ ఎక్స్టింగ్విషర్స్ ఉపయోగించడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జన్నారం ఫైర్ స్టేషన్ సిబ్బంది స్వయంగా ఫైర్ ఎక్స్టింగ్విషర్స్ ఉపయోగించి, దాన్ని ఎలా వాడాలో, ఏ రకమైన మంటలను అర్పించడానికి ఏ రకమైన ఫైర్ ఎక్స్టింగ్విషర్ ఉపయోగించాలో, ప్రయోగాత్మకంగా చూపించారు. మంటల రకాలు, అలాగే పాస్ పద్ధతి గురించి కూడా వివరించారు. అంటే: (పిన్ లాగడం), (మంటల వైపు చూపడం), (హ్యాండిల్ నొక్కడం), స్వీప్ (మంటల పై నుండి పైకి కదిలించడం). ఆదిత్య పిల్లల హాస్పిటల్ యజమాని మగ్గిడి తిరుపతి మరియుడాక్టర్ గోవర్ధన్ రెడ్డి హాస్పిటల్ సిబ్బంది ఈ సదస్సులో ఉత్సాహంగా పాల్గొన్నారు. అగ్ని ప్రమాదాల సమయంలో అనుసరించాల్సిన నిబంధనలను పాటించడం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం పట్ల సిబ్బంది స్పందిస్తూ, అగ్ని ప్రమాదాల గురించి అవగాహన పెరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలను నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జాతీయ బీసీ కమిషన్ ఛైర్పర్సన్ గా సాధ్వీ నిరంజన్ జ్యోతి

**మన దునియా,న్యూఢిల్లీ:మార్చి 28**



జాతీయ బీసీ కమిషన్ ఛైర్పర్సన్గా కేంద్ర మాజీ మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి బాధ్యతలు స్వీకరించారు. ఉత్తర్ ప్రదేశ్కు చెందిన ఈమె 2014 నుంచి 2024 వరకు ఫతేపుర్ పార్లమెంటు సభ్యురాలిగా పనిచేశారు. మోదీ మంత్రివర్గంలో ఆహారశుద్ధి పరిశ్రమలు, వినియోగదారులు, ప్రజాపంపిణీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధిశాఖల సహాయమంత్రిగా సేవలందించారు. అంతకుముందు 2012లో యూపీలోని హమీర్పుర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈమెతో పాటు కమిషన్ సభ్యుడిగా మహారా ష్ట్రకు చెందిన కిరణ్ ఉమేష్ మహాలె కూడా బాధ్యతలు స్వీకరించారు.

## రేషన్ కార్డులు ఉన్నవారికి శుభవార్త

**మన దునియా,హైదరాబాద్: మార్చి 28**

హైదరాబాద్: రేషన్ కార్డు లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఏప్రిల్ నెలలోనే ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది.ప్రస్తుతం భారత ఆహార సంస్థ గోదాముల్లో బియ్యం నిల్వలు భారీగా పేరుకుపోవడంతో, రాబోయే కొత్త ధాన్యానికి చోటు కల్పించేందుకు ప్రభుత్వం ఈ కీలక అడుగు వేసింది.ప్రస్తుతం నెలకు ఒక్కో వ్యక్తికి 6 కిలోల చొప్పున బియ్యం ఇస్తున్నారు. మూడు నెలల కోటా కలిపి ఏప్రిల్లో ఒక్కో వ్యక్తికి 18 కిలోల బియ్యం అందుతాయి. ఒక కుటుంబంలో నలుగురు సభ్యులుంటే 72 కిలోలు, ఐదుగురు సభ్యులుంటే ఏకంగా 90 కిలోల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తారు. గత సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ భారీగా చేరడం, త్వరలో యాసంగి ధాన్య సేకరణ ప్రారంభం కానుండటంతో గోదాములను ఖాళీ చేయడం అత్యవసరంగా మారింది. మూడు నెలల కోటాను ఒకేసారి అందించేందుకు వీలుగా పౌరసరఫరాల శాఖ సాఫ్ట్వేర్లో మార్పులు చేస్తోంది. లబ్ధిదారులు ఒకేసారి వేలిముద్ర వేయాలా లేక మూడుసార్లు వేయాలా అనే సాంకేతిక అంశంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.05 కోట్ల రేషన్ కార్డుల పరిధిలోని 3.40 కోట్ల మంది లబ్ధిదారులకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఇందుకోసం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సిద్ధం చేస్తున్నారు. ఏప్రిల్ 1 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పంపిణీ ప్రారంభించాలని యోచిస్తున్నారు.



# నేటి నుంచి ఐపీఎల్ ధమాకా షురూ!

**ప్రారంభంలోనే హై వోల్టేజ్ మ్యాచ్!**

**మన దునియా,హైదరాబాద్:మార్చి 28**

టి20 వరల్డ్ కప్ లో భారత జట్టు జైత్రయాత్రను చూసి మూడు వారాలు గడిచాయి వరుసగా రెండోసారి ప్రపంచ కప్ సాధించిన టీమిండియా కు మన అభిమానులంతా జేజేలు పలికారు. ఆ తర్వాత క్రికెట్ కు కాస్త విరామం లభించిన ఇప్పుడు మళ్లీ అందరిలో జోష్ నింపే వేసవి వినోదం వచ్చేసింది,కొద్ది రోజుల క్రితం వరకు ఒకే జట్టుగా టీం ఇండియన్ ఛాంపియన్లు గా నిలిపిన సహచరు లంతా ఇప్పుడు ప్రత్యర్థు లుగా తలపడేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న నిరీక్షణ ముగిసింది. నేటి నుండి ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఐపీఎల్ 2026 19వ సీజన్ మొదలు కాబోతుంది. దాదాపు రెండు నెలల పాటు అభిమానులను అలరించే ఈ లీగ్లో మే 24 వరకు లీగ్ దశ మ్యాచ్లు జరగనుండగా..మే 31న ఫైనల్ పోరు జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు,సన్రైజర్స్ హైదరాబాద్, మధ్య బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం లో ఈరోజు రాత్రి 7 గంటల కు జరిగే తొలి మ్యాచ్ తో ఈ మెగా టోర్నీకి తెరలేవనుం ది.గతేడాది తొలిసారి టైటిల్ ను గెలుచుకున్న ఆర్సీబీ ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్ గా బరిలోకి దిగుతుండగా.. మరోవైపు సన్ రైజర్స్ కూడా గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమైంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నప్పటికీ.. బీసీసీఐ ఎన్నికల తేదీలను పరిగణనలోకి తీసుకుని రెండు దశల్లో పూర్తి షెడ్యూల్ ను విడుదల చేసింది. 15 రోజుల పాటు సాగే తొలి దశ షెడ్యూల్ మార్చి 28 నుండి ఏప్రిల్ 12 వరకు జరగనుంది. 2022 నుండి అమలవుతున్న ఫార్మాట్ ప్రకారమే ఈ సీజన్ కూడా సాగనుంది. మొత్తం 10 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-ఎలో సీఎస్కే, కేకేఆర్, ఆర్ఆర్, ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్ ఉండగా.. గ్రూప్-బిలో ముంబై ఇండియన్స్, సన్రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఉన్నాయి. లీగ్ దశలో ప్రతి జట్టు 14 మ్యాచ్ లు చొప్పున మొత్తం 70 మ్యాచ్లు ఆడతాయి. ఇందులో తమ గ్రూప్ లోని మిగిలిన నాలుగు జట్లతో రెండేసి మ్యాచ్ లు, ఇతర గ్రూప్ లో తమ స్థానంలో ఉన్న జట్టుతో రెండు మ్యాచ్ లు, మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. లీగ్ దశ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో టాప్-4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్కు అర్హత సాధిస్తాయి. టాప్-2 జట్ల మధ్య క్వాలిఫయర్-1, మూడు �్ర నాలుగు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతుంది. ఆ తర్వాత క్వాలిఫయర్-1 లో ఓడిన జట్టు, ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్-2 లో తలపడుతుంది. మే 31న జరిగే ఫైనల్ పోరులో క్వాలిఫయర్-1 ్ర క్వాలిఫయర్-2 విజేతలు టైటిల్ కోసం తాడోపేడో తేల్చుకుంటారు.




# ఉపాధి హామీ పనుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోంది





- **సిరిసిల్ల జిల్లాలో సగటున 50 రోజులు కూడా పనులు కల్పించలేకపోయారు**
- **బడ్జెట్లో ఈ పథకానికి రూ.95,692 కోట్లను కేటాయించాం**
- **ప్రతి ఒక్కరికీ 125 రోజులు పని కల్పించండి**
- **రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**
- **సిరిసిల్ల జిల్లా అంకిరెడ్డిపల్లె, ముస్తాబాద్ లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి**

**మన దునియా,సిరిసిల్ల జిల్లా అంకిరెడ్డిపల్లె,ముస్తాబాద్:మార్చి 28**

ఏటా 125 రోజులపాటు పని కల్పించాలనే లక్ష్యంతో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వీబీజీ రామ్ జీ పథకాన్ని తీసుకొచ్చినా, తెలంగాణలో ఆశించిన విధంగా పని దినాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సిరిసిల్ల జిల్లాలో 92 వేల జాబ్ కార్డులుంటే సగటున 50 రోజులలోపు మాత్రమే పని కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరికి ఏటా 125 రోజుల పని కల్పించేలా ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులను కోరారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డి పల్లె గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.25 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముస్తాబాద్ లో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు అంకిరెడ్డిపల్లెలో ఛత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. ఏమన్నారంటే....దేశవ్యాప్తంగా శ్రీరామనవమి ఉత్సవాలను ధార్మిక చింతనతో నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. ఏ గ్రామం వెళ్లినా, ఏ ఆలయం వెళ్లినా సీతారామచంద్రస్వామి కళ్యాణ వేడుకలతో కళకళలాడాయి. ఈరోజు తంగళ్లపల్లి మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో రూ.25 లక్షల నిధులతో, ముస్తాబాద్ అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద గత ఏడాది నా పార్లమెంట్ నియోజకవర్గంలో 32 కోట్ల 13 లక్షల రూపాయలు ఖర్చు చేసి రోడ్లను నిర్మించినం. మొత్తంగా చూస్తే ఇప్పటి వరకు దాదాపు 700 కోట్ల రూపాయల నిధులను మన పార్లమెంట్ పరిధిలో ఖర్చు చేసినం. ఈసారి ( 2026-27) కేంద్ర బడ్జెట్లో జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన విబి-జీ రామ్ జీ పథకానికి 95 వేల 692 కోట్లను కేటాయించినం. గ్రామీణాభివృద్ధి శాఖ బడ్జెట్ లో ఈ ఒక్క పథకానికే 40 శాతం నిధులు కేటాయించినం. మన తెలంగాణ విషయానికొస్తే... ఈ పథకం కింద 3 వేల కోట్లకుపైగా నిధులు వచ్చే అవకాశముంది. రాష్ట్రంలో సుమారు 32 లక్షల జాబ్ కార్డ్ హోల్డర్లు ఈ పథకం కింద లబ్ది పొందుతున్నారు. ఏటా 125 రోజులపాటు పని కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చినం. కానీ తెలంగాణలో ఆశించిన విధంగా పని దినాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. ముఖ్యంగా సిరిసిల్ల జిల్లాలో ఆశించిన స్థాయిలో పనిదినాలు కల్పించలేకపోతున్నారు. ఈ జిల్లాలో 92 వేల జాబ్ కార్డులుంటే సగటున 50 రోజులలోపు మాత్రమే పని కల్పిస్తున్నారు. 6 వేలలోపు కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పని దినాలు కల్పించారు. ప్రతి ఒక్కరికి ఏటా 125 రోజుల పని కల్పించేలా ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులను కోరుతున్నా... ఈ పథకానికి అయ్యే వ్యయంలో 60 శాతం నిధులను కేంద్రం ఎప్పటికప్పుడు రిలీజ్ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను సైతం జాప్యం లేకుండా 40 శాతం నిధులను విడుదల చేయాలని కోరుతున్నా...పంచాయతీలకు, మున్సిపాలిటీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నయాపైసా ఇయ్యడం లేదు. కానీ నిత్యం కేంద్రంపై దుమ్మెత్తి పోయడం అలవాటైంది. మోదీ ప్రభుత్వం ఎరువుల కొరత లేకుండా కావాల్సినన్ని ఎరువులను సరఫరా చేస్తున్నా... వాటిని అందుబాటులో ఉంచడంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ పెట్టడం లేదు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి లాగుల తొండలు విడుస్తా అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. 6 గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను దారి మళ్లిస్తున్నారు. కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టడాన్ని హర్షిస్తున్నాం. ఇది ప్రజాస్వామ్య దేశం. ఎవరైనా పార్టీ పెట్టొచ్చు. ప్రజా సమస్యలపై పోరాడిన పార్టీలకే మనుగడ ఉంటుంది.



# నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుతో...







**సీఎంలో డిప్రెషన్ మొదలైంది**

**ప్రధానిపై దిగజారి మాట్లాడుతున్నారు**

**దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విద్వేషాలు రగిలించాలనుకుంటున్నారు**

**6 గ్యారంటీలపై దృష్టి మళ్లించేందుకు అనేక డ్రామాలాడుతున్నారు**

**కాళేశ్వరం డిజైన్ లోపం బాధ్యత కేసీఆర్ దే**

**కేసీఆర్ తో సీఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కు**

**అందుకే కేసీఆర్ కుటుంబం సహా బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం లేదు**

**కవితార్టీని స్వాగతిస్తున్నాం...**

**ప్రజల కోసం, పేదల కోసం పనిచేస్తేనే ఏ పార్టీకైనా గుర్తింపు**

**సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్...**

**మన దునియా,కరీంనగర్ జిల్లా: మార్చి 28**

నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లను కేంద్రం అమలు చేసేందుకు సిద్ధమవ్వడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో డిప్రెషన్ మొదలైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అందుకే ప్రధానిపై దిగజారి మాట్లాడుతున్నారని, దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం డిజైన్ లోపానికి ప్రధాన బాధ్యత కేసీఆర్ దేనని చెప్పారు. అయినప్పటికీ కేసీఆర్ ను, కాళేశ్వరం అవినీతి పరులను రేవంత్ రెడ్డి సర్కార్ అరెస్ట్ చేయడం లేదని అన్నారు. కేసీఆర్ తో రేవంత్ రెడ్డి కుమ్మక్కవడంవల్లే కేసీఆర్ కుటుంబంసహా బీఆర్ఎస్ నేతల అవినీతిపై చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఈరోజు కరీంనగర్ లోని తన నివాసంలో సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసిన కేంద్ర మంత్రి వాటి పనితీరును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు బండి సంజయ్ బదులిచ్చారు...

నియోజకవర్గాల పునర్విభజనపై....

నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లను కేంద్రం అమలు చేస్తుంటే....ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్రెషన్ లోకి వెళుతున్నారు. ప్రధానమంత్రి స్థాయి వ్యక్తిపై దిగజారి మాట్లాడుతున్నారు. సీఎం భాషను చూసి తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోంది. ఓట్ల కోసం 6 గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీలిస్తారు. అధికారంలోకి వచ్చాక గాడిద గుడ్డు చూపిస్తారు. లాగుల తొండలు విడుస్తానని అంటారు. ఇదేందని మేం మాట్లాడితే గుండు, బండి అని మాట్లాడతారే తప్ప ఆ హామీలను అమలు చేయాలనే సోయే ఉండదు.

కవిత కొత్త పార్టీపై అడిగిన ప్రశ్నకు....

ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ పెట్టుకోవచ్చు. స్వాగతిస్తాం. అయితే ప్రజల కోసం, పేదల కోసం ఏ పార్టీ పనిచేసినా ఆ పార్టీకే మనుగడ ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

కాళేశ్వరం డిజైన్ లోపంపై....

కాళేశ్వరం డిజైన్ లోపానికి ప్రధాన కారకులు కేసీఆరే. ఎందుకంటే ఆయన ఇంజనీర్ అవతారమెత్తారు. అనేక వేషాలు వేసి డిజైన్లు తయారు చేశారు. కాబట్టి దీనికి ప్రధాన బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం కాళేశ్వరం డిజైన్ కారకులను, అవినీతిపరులను అరెస్ట్ చేయడం లేదు. ఎందుకంటే కేసీఆర్ తో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు. అందుకే అవినీతికి పాల్పడినా, డిజైన్ లోనే లోపముందని తేల్చినా చర్యలు తీసుకోవడం లేదు. ఇదేమని అడిగితే కేంద్రంపై నెపం మోపి తప్పించుకోవాలని చూస్తున్నారు. సీబీఐకి పంపిన లేఖలోనూ పూర్తిస్థాయిలో వాస్తవాలు చెప్పలేదు.

డీలిమిటేషన్ తో దక్షిణాదిరాష్ట్రాలకు అన్యాయంపై....

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి జరిగే నష్టం ఏమిటో ఇప్పటి వరకు సీఎం చెప్పలేదు. ఏ ప్రాంతానికి అన్యాయం జరగదు. అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచుతున్నప్పుడు దక్షిణాదికి అన్యాయం ఎట్లా జరుగుతుంది? 6 గ్యారంటీల అమలు చేయడం చేతగాక ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ డ్రామాలాడుతున్నరు. మహిళలకు నెలకు రూ. 2500లు, వృద్దులకు రూ.4 వేల పెన్షన్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు రైతు భరోసా, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, మహిళలకు తులం బంగారం, స్కూటీ ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలి. ముందు వాటి సంగతి తేల్చిన తరువాత మాట్లాడాలి. అంతే తప్ప వాటిని అమలు చేయలేక రాష్ట్రాన్ని అప్పులు పాల్జేసి ప్రజలను దారి మళ్లించేందుకు ఉత్తరాది, దక్షిణాది అంటూ డ్రామాలాడుతున్నారు. రాష్ట్రాభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరించేందుకు సిద్దంగా ఉంది. రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధిపైన, 6 గ్యారంటీల అమలుపైన దృష్టి సారించాలని కోరుతున్నా.

## మొక్కజొన్న రైతుల కోసం కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ.. మద్దతు ధర కల్పించాలని విజ్ఞప్తి

**మన దునియా,ఆంధ్రప్రదేశ్:మార్చి 28**

రాష్ట్రంలోని మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. మార్కెట్‌లో ధరలు దారుణంగా పడిపోవడంతో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు పడుతున్న ఇబ్బందులను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఏడాది రబీలో రికార్డు స్థాయిలో సుమారు 4.83 లక్షల హెక్టార్లలో మొక్కజొన్న సాగైందని, దీనివల్ల ఉత్పత్తి పెరిగి ధరలు పతనమయ్యాయని వివరించారు. క్వింటాల్‌కు రూ. 2,400 కనీస మద్దతు ధర ఉండగా, మార్కెట్‌లో కేవలం రూ.1,500 నుంచి రూ. 1,700 మాత్రమే లభిస్తోందని, దీంతో పెట్టుబడి ఖర్చులు కూడా రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.మంత్రి నివేదికపై స్పందించిన చంద్రబాబు, రైతుల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.



మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద ఏపీకి ప్రత్యేకంగా ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ పథకాన్ని అమలు చేయాలని లేఖలో కోరారు. ఈ పథకం కింద అయ్యే నష్టాన్ని పూర్తిగా (100శాతం) కేంద్ర ప్రభుత్వమే భరించాలని, మొత్తం ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం సానుకూలంగా స్పందిస్తే రాష్ట్రంలోని వేలాది మంది రైతులకు ఆర్థికంగా ఊరట లభిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రం వద్ద ఈవ్ టీజింగ్ అరికట్టేందుకు ప్రత్యేక నిఘా

**మన దునియా,జయశంకర్ భూపాలపల్లి జిల్లా:మార్చి 28**



జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ ఆదేశాల మేరకు టేకుమట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో పదవ తరగతి పరీక్షల సందర్భంగా,పరీక్షా కేంద్రం వద్ద బాలికలపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈవ్ టీజింగ్‌ను పూర్తిగా అరికట్టాలనే ఉద్దేశంతో టేకుమట్ల ఎస్సై అమూల్య గారు సాధారణ మహిళ వేషధారణలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులతో కలిసి ఉండి పరిస్థితులను నిశితంగా పరిశీలించారు.పరీక్షా కేంద్రం పరిసరాల్లో అల్లరి చేసే యువకులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, బాలికలు నిర్భయంగా పరీక్షలు రాసేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించేలా సిబ్బందికి సూచనలు ఇచ్చారు.ఎస్సై అమూల్య మాట్లాడుతూ, విద్యార్థినుల భద్రత పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యత అని, పరీక్షా కేంద్రాల వద్ద ఈవ్ టీజింగ్, వేధింపులు, అనుచిత ప్రవర్తనపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలు ధైర్యంగా చదువుపై దృష్టి పెట్టి పరీక్షలు రాయాలని సూచించారు.

## ఏపీలో బంగారు గనులు - - తవ్వకాలకు సిద్ధం!

**మన దునియా,కర్నూలు: మార్చి 28**



కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి వేదికగా భారీ ఎత్తున బంగారు గనుల తవ్వకం ప్రాజెక్టు పట్టాలెక్కుతోంది. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ తరహాలో, భారతదేశపు తదుపరి అతిపెద్ద బంగారు గనిగా అవతరించబోతోంది. జియో మైసూర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ నేతృత్వంలో సాగుతున్న ఈ ప్రాజెక్టు, అత్యాధునిక సాంకేతికతతో దేశీయంగా బంగారు ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం వేగంగా ఇస్తున్న అనుమతులు , పారదర్శకమైన విధానాలు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని నింపుతున్నాయి. దశాబ్దాలుగా నత్తనడకన సాగిన ఈ గనుల తవ్వకం అంశంపై, ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మౌలిక సదుపాయాల కల్పన , అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసింది. ఇది కేవలం ఒక మైనింగ్ ప్రాజెక్టు మాత్రమే కాకుండా .. జాతీయ ప్రాధాన్యమున్న ప్రాజెక్టుగా గుర్తిస్తున్నారు.జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టు ద్వారా ఏటా సుమారు 750 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, స్థానికంగా వేలాది మందికి ఉపాధి లభించడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరనుంది. అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో ఈ ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారే అవకాశం ఉంది. ఈ గోల్డ్ మూమెంట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో పెంచుతోంది. గనుల తవ్వకంలో పర్యావరణ నియమాలను పాటిస్తూనే, పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేయడం ద్వారా రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతోంది. దేశ అవసరాలకు తగ్గట్టుగా బంగారు దిగుమతులను తగ్గించి, స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయడంలో జొన్నగిరి కీలక పాత్ర పోషించనుందని భావిస్తున్నారు.

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?

చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది.ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము.ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## కరీంనగర్ సీపీపై అసెంబ్లీలో తీవ్ర ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**సీపీ మీద సీఐడీ విచారణ జరపాలి**



**మన దునియా ప్రతినిధి బచ్చల శ్రీకాంత్ కమలాపూర్**

రాష్ట్ర అసెంబ్లీలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కరీంనగర్ జిల్లా జూ వ్యవహారాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో కూడా ఈ అంశంపై క్లారిఫికేషన్ కోరినట్లు పేర్కొంటూ, కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది తరఫున ఈ విషయాన్ని సభ దృష్టికి తీసుకువస్తున్నట్లు తెలిపారు.కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ వాహనాలను ప్రైవేట్ వ్యక్తులు వినియోగిస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్ సీపీ ప్రైవేట్ వ్యక్తులతో కలిసి ప్రభుత్వ ఆయుధాలు ఉపయోగించి ఫైరింగ్ నిర్వహించారని తెలిపారు. ఏకే-47తో 10 రౌండ్లు, ఎస్ఎల్ఆర్‌తో 10 రౌండ్లు, పిస్తోల్ తో 10 రౌండ్లు ఇతర ఆయుధాలతో కలిపి మొత్తం 108 రౌండ్లు ఫైరింగ్ జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో బోనాలపల్లి గ్రామం పరిసర ప్రాంతాల్లో బుల్లెట్లు పడినట్లు, బోనాలపల్లి గ్రామానికి చెందిన అమృతమ్మకు బుల్లెట్లు తగిలినట్లు ఆరోపించారు.కరీంనగర్ జిల్లాలో 330 మంది హోమ్ గార్డులను ఇతర జిల్లాలకు బదిలీ చేసి, తిరిగి పోస్టింగుల కోసం లక్షల రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. 108 మంది హోమ్ గార్డుల నుంచి సుమారు రూ.1.86 లక్షలు కోట్లు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.బడేకాన్ పేరుతో ఒక్కో ఎస్ హెచ్ ఓ,నుంచి రూ.25,000 వసూళ్లు చేసినట్లు, స్పిన్నఫ్ బాటిళ్ల పేరుతో కూడా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపించారు. పోలీస్ సిబ్బందికి సరెండర్, టీ ఏ,లు టిఏలు డిఏలు ఎరియర్స్ ఇవ్వడం లేదని, కానిస్టేబుళ్లు, ఏ ఎస్ ఐ,లు ఎస్ఐలు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని ప్రతి పోలీస్ సిబ్బంది తరఫున ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నట్లు చెప్పారు.ఇటీవల జరిగిన ఇల్లంతకుంట రాములవారి కల్యాణానికి భారీగా ప్రజలు హాజరైనప్పటికీ సీపీ సమీక్షా సమావేశానికి హాజరు కాకపోవడం నిర్లక్ష్యంగా పేర్కొన్నారు. ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని విమర్శించారు.తాను చేసిన ఆరోపణలపై సీఐడీ ద్వారా పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. తన ఆరోపణలు తప్పైతే క్షమాపణ చెప్పడానికి సిద్ధమని స్పష్టం చేశారు. కరీంనగర్ సీపీపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు తొలగిపోతాయా?

కిడ్నీలో రాళ్లుంటే బీరు తాగితే కరిగిపోతాయని కొన్ని సార్లు వింటుంటాం. ఇది ఎంత వరకు నిజం. బీర్ రాళ్లను కరిగిస్తుందా, రాళ్ళను పగొలగొట్టి వాటిని బయటకు పంపుతుందా? కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది అతిపెద్ద అపోహ. కిడ్నీ మన శరీరంలో చాలా ముఖ్యమైన భాగం. ఇది మన శరీరంలోని టాక్సిన్స్‌ని తొలగించడానికి పని చేస్తుంది. కిడ్నీలో రాళ్ల వల్ల నొప్పి వస్తోందని, చాలా మంది ఆ రాళ్లను తొలగించుకోవడానికి బీరు తాగడం ప్రారంభిస్తారు. ఇప్పుడు బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య తీరుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి ఈ విషయంలో అసలు నిజం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం. ఇది కేవలం అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్రీయ ఆధారం లేదు. అధ్యయనం ప్రకారం, బీర్ ఒక ఆల్కహాలిక్ డ్రింక్. ఇది ఒక మూత్రవిసర్జన, దీనిని తాగినప్పుడు సాధారణం కంటే ఎక్కువ మూత్రం ఉత్పత్తి అవుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు తీయడంలో సహాయపడుతుంది, అయితే ఇది ఇప్పటివరకు ఏ అధ్యయనంలో నిరూపించబడలేదు, అందుకే డాక్టర్ రోగికి బీర్ తాగమని సలహా ఇవ్వడు. సిఫార్సు చేయబడదు. రోగి కిడ్నీలో రాళ్ళను తొలగించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బీర్ తాగడం ప్రారంభిస్తే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చు, అది వ్యసనానికి గురయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది, అయితే ఎక్కువ బీర్ తాగడం వల్ల మీ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే డీహైడ్రేషన్ కూడా వస్తుంది, మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి. అయితే, మద్యం ఏ సందర్భంలోనైనా హానికరం. రెగ్యులర్ బీర్ తాగేవారిలో ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రాన్ని వడపోత చేయడం, తద్వారా వ్యర్థాలను బయటకు నెట్టివేయడం కిడ్నీల పని, అయితే ఆహారంలో క్యాల్షియం, పొటాషియం, మినరల్స్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీల నుంచి వ్యర్థ పదార్థాలు పూర్తిగా తొలగిపోవు. తరువాత, ఈ వ్యర్థ పదార్థాలు క్రమంగా పేరుకుపోతాయి మరియు రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి, దీనిని వైద్య భాషలో కిడ్నీ స్టోన్ అంటారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్ఫరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.

# బీఆర్ఎస్‌కు కాలం చెల్లింది -- మాదే అసలైన తెలంగాణ పార్టీ: కవిత


**మన దునియా,హైదరాబాద్: మార్చి 28**



తెలంగాణ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తూ తన తండ్రి కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ ఉనికినే ప్రశ్నించేలా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై అసలైన తెలంగాణ పార్టీ మాదే బీఆర్ఎస్ పని అయిపోయింది అనే సంకేతాలిస్తూ ఆమె తన నూతన రాజకీయ అజెండాను ప్రకటించారు. ఏప్రిల్ 25న మేడ్చల్ సమీపంలోని మునీరాబాద్ వేదికగా పార్టీ జెండాను ఆవిష్కరించి, సరికొత్త రాజకీయ విప్లవానికి నాంది పలకనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.తెలంగాణ ఉద్యమ పార్టీగా పుట్టిన బీఆర్ఎస్, ఇప్పుడు తన లక్ష్యాలను విస్మరించిందని కవిత ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నా.. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో ప్రజలు ఇంకా ఇబ్బందులు పడుతున్నారని, ఇది పార్టీ వైఫల్యమేనని ఆమె చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఉన్న ఉనికి ఇప్పుడు నామమాత్రమే. ఆ పార్టీలోని నిజమైన కార్యకర్తలు, ఉద్యమకారులు అందరూ ఇప్పుడు నా వెంటే ఉన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ఏకైక ప్రాంతీయ శక్తిగా మా పార్టీ ఎదగబోతోంది అని ఆమె ప్రకటించారు.తాను పెట్టబోయే కొత్త పార్టీని ఇతర పార్టీలకు బీ టీమ్‌గా అభివర్ణించడాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణలో ఏ కొత్త ఆలోచన వచ్చినా ఇలాంటి ముద్రలు వేయడం రాజకీయ కుట్రలో భాగమేనని ఆమె కొట్టిపారేశారు. నేను నిజామాబాద్ బిడ్డను. ఇక్కడ పుట్టిన ఏ ఆలోచనైనా చరిత్ర సృష్టించింది. భవిష్యత్తులో తెలంగాణలో నంబర్ వన్ పార్టీగా మాదే ఉంటుంది. మాది ప్రజల ఇంటి పార్టీ గా మారి, రాష్ట్ర రాజకీయాల ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తుందని చెప్పుకొచ్చారు. తన కొత్త పార్టీలో పాత తరం రాజకీయాల కంటే యువతకు, మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని కవిత వెల్లడించారు. బీఆర్ఎస్ క్యాడర్ మొత్తం తనతోనే ఉందని, వారందరినీ సమన్వయం చేసుకుంటూ కొత్త ఉత్సాహంతో ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ శూన్యాన్ని భర్తీ చేసేందుకు, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు కొత్త పార్టీ అనివార్యమైందని ఆమె స్పష్టం చేశారు. వచ్చే ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 10 గంటలకు మేడ్చల్ వద్ద ఉన్న మునీరాబాద్‌లో భారీ బహిరంగ సభ ద్వారా పార్టీ జెండాను ఆవిష్కరించి, అధికారికంగా పార్టీ పేరును ప్రకటించనున్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమం కోసం భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సభ ద్వారా తన రాజకీయ బలాన్ని నిరూపించుకోవాలని, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం తామేనని చాటిచెప్పాలని కవిత వ్యూహరచన చేస్తున్నారు.

# హర్మూజ్‌లో ఉద్రిక్తత.. నౌకల భద్రతకు ఏకమైన యూరప్, జపాన్

**మన దునియా,ఇంటర్నేషనల్ డెస్క్:మార్చి 28**




హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో వాణిజ్య నౌకల సురక్షిత రాకపోకలను నిర్ధారించేందుకు యూరప్‌లోని కీలక దేశాలు, జపాన్ ముందుకు వచ్చాయి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్‌తో పాటు జపాన్ ఈ మేరకు ఓ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలలో భాగస్వాములమవుతామని స్పష్టం చేశాయి.అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ చేపట్టిన చర్యలను ఈ దేశాలు తీవ్రంగా ఖండించాయి. "ఇరాన్ తన బెదిరింపులు, మైన్‌లు అమర్చడం, డ్రోన్, క్షిపణి దాడులతో పాటు వాణిజ్య నౌకలను అడ్డుకునే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలి" అని బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో ఆ దేశాలు డిమాండ్ చేశాయి. అంతర్జాతీయ నౌకాయానానికి ఆటంకాలు కలిగించడం ప్రపంచ శాంతిభద్రతలకు ముప్పు అని పేర్కొన్నాయి.ఇరాన్‌తో యుద్ధం 20వ రోజుకు చేరుకోగా, ఈ జలసంధి ప్రస్తుతం దాదాపుగా మూతపడింది. ఇప్పటివరకు 10 ట్యాంకర్లు సహా మొత్తం 23 వాణిజ్య నౌకలపై దాడులు జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ దాడుల వల్ల చమురు, గ్యాస్ రవాణాకు అంతరాయం కలిగి ధరలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశాయి.మరోవైపు, హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల కోసం తిరిగి తెరిచేందుకు సాయం చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాటో సహా ఇతర దేశాలను కోరారు. అయితే, ఈ దేశాలు ఆయన పిలుపును ప్రస్తుతానికి సున్నితంగా తిరస్కరించాయి. తక్షణ సైనిక చర్యకు బదులుగా చర్చలు, ప్రణాళికలకు సిద్ధమని సంకేతాలిచ్చాయి.

# భద్రాచల పాలకమండలి సభ్యునిగా ఎన్నిక అయిన సురేందర్ బాబు గారిని సన్మానించిన యూత్ కాంగ్రెస్..!



ఈరోజు మంగపేట మండలము తిమ్మంపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు జిల్లా ప్రచార కమిటీ చైర్మెన్ పూజరి సురేందర్ బాబు గారిని యూత్ కాంగ్రెస్ మండల అద్యక్షుడు మురుకుట్ల నరేందర్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానము చేసారు ఉత్తమ మైన వ్యక్తికీ ఆ రాములోరి ఆశీర్వాదముతో మండలి సభ్యునిగా అవకాశం దొరకడం సంతోషకరం అని అన్నారు నియమకానికి సహకరించిన గౌరవ అదిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేసారు శ్రీరాముని ఆశీస్సులు ఎల్లవేలల ఉండాలని నిండు నూరేళ్లు సంతోషంగా ఆరోగ్యాంగా ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు..! కార్యాక్రమములో మండల అధ్యక్షులు నరేందర్, చీూఖ× అద్యక్షులు బోడ జయరాజ్,జిల్లా యూత్ నాయకులు బాసరికారి నాగార్జున,ఎడ్ల నరేష్ మండల నాయకులు మద్దెల ప్రవీణ్,మూగల చంటి,బూర్గుల సతీష్,గోమాసు లక్ష్మి నారాయణ,జాడి మురళి గోమాసు నర్సింహరావు,తదితరులు పాల్గొన్నారు..



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# ఛేజింగ్ లో కోహ్లీ క్లాస్, పడిక్కల్ మాస్... తొలి మ్యాచ్‌లో ఓడిన సన్ రైజర్స్



ఐపీఎల్ 2026 సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరితమైన తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్దేశించిన 202 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 15.4 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించి, టోర్నీలో శుభారంభం చేసింది. విరాట్ కోహ్లీ అజేయ అర్ధశతకంతో పాటు దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్‌ల విధ్వంసకర బ్యాటింగ్ ముందు సన్‌రైజర్స్ బౌలర్లు తేలిపోయారు.భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఆరంభంలోనే ఓపెనర్ ఫిల్ సాల్ట్ (8) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. అయితే, ఆ తర్వాత విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్ సృష్టించిన విధ్వంసం మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు కేవలం 45 బంతుల్లోనే 101 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా పడిక్కల్ (26 బంతుల్లో 61; 7 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు వేగంతో పరుగులు సాధించి సన్‌రైజర్స్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. పడిక్కల్ ఔటయ్యాక వచ్చిన కెప్టెన్ రజత్ పటీదార్ (12 బంతుల్లో 31; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) తన వంతు మెరుపులు మెరిపించి విజయాన్ని మరింత చేరువ చేశాడు. ఒకే ఓవర్లో పటీదార్, జితేష్ శర్మ (0) ఔటైనా, మరో ఎండ్‌లో విరాట్ కోహ్లీ (38 బంతుల్లో 69 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు) చివరి వరకు నిలిచి టిమ్ డేవిడ్ (16 నాటౌట్)తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో డేవిడ్ పేన్ రెండు వికెట్లు తీసినప్పటికీ, మిగతా వారెవరూ భారీ పరుగుల ప్రవాహాన్ని అడ్డుకోలేకపోయారు. ఈ విజయంతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది.అంతకుముందు, టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టుకు ఆరంభంలోనే ట్రావిస్ హెడ్ (11), అభిషేక్ శర్మ (7) వికెట్లను త్వరగా కోల్పోవడంతో 29 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో కెప్టెన్ ఇషాన్ కిషన్ (38 బంతుల్లో 80; 8 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ (31)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఇషాన్ ఔటైన తర్వాత, చివర్లో యువ ఆటగాడు అనికేత్ వర్మ (18 బంతుల్లో 43; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో హైదరాబాద్ 200 పరుగుల మార్కును దాటగలిగింది. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ అత్యంత పొదుపుగా బౌలింగ్ చేసి కేవలం 22 పరుగులిచ్చి 3 వికెట్లతో సత్తా చాటాడు. రొమారియో షెపర్డ్ 54 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.

# ఇషాన్ కిషన్ కెప్టెన్ ఇన్నింగ్స్, చివర్లో చెలరేగిన అనికేత్... సన్‌రైజర్స్ భారీ స్కోరు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఆకట్టుకునే బ్యాటింగ్ ప్రదర్శన చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (80) అద్భుతమైన ఇన్నింగ్స్‌కు, చివర్లో యువ కెరటం అనికేత్ వర్మ (43) విధ్వంసం తోడవడంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో ఆర్సీబీ ముందు 202 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ ప్రారంభించిన హైదరాబాద్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (11), అభిషేక్ శర్మ (7) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. నితీశ్ కుమార్ రెడ్డి (1) కూడా విఫలమవడంతో సన్‌రైజర్స్ 4.2 ఓవర్లలో కేవలం 29 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ 3 వికెట్లు జాకబ్ డఫీ ఖాతాలోకి చేరాయి. ఈ దశలోకెప్టెన్ ఇషాన్ కిషన్ జట్టు బాధ్యతను తన భుజాలపై వేసుకున్నాడు.ఆర్సీబీ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన ఇషాన్, మైదానం నలువైపులా బౌండరీలు బాదాడు. కేవలం 38 బంతుల్లో 8 ఫోర్లు, 5 భారీ సిక్సర్లతో 80 పరుగులు చేసి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. అతనికి హెన్రిచ్ క్లాసెన్ (31) నుంచి మంచి సహకారం లభించింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 97 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారు. ఇషాన్ ఔటైన తర్వాత స్కోరు బోర్డు నెమ్మదిస్తుందని భావించిన తరుణంలో, యువ బ్యాటర్ అనికేత్ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 18 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 43 పరుగులు చేసి స్కోరును 200 పరుగులు దాటించడంలో ప్రధాన పాత్ర పోషించాడు. అతని మెరుపు ఇన్నింగ్స్ వల్లే హైదరాబాద్ ఈ భారీ స్కోరును అందుకోగలిగింది.ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ అద్భుతంగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో కేవలం 22 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. రొమారియో షెపర్డ్ మూడు వికెట్లు తీసినప్పటికీ 54 పరుగులు సమర్పించుకున్నాడు. భువనేశ్వర్ కుమార్, సుయాశ్ శర్మ, అభినందన్ సింగ్‌లకు తలో వికెట్ దక్కింది. సొంత మైదానంలో ఆర్సీబీ ఈ భారీ లక్ష్యాన్ని ఎలా ఛేదిస్తుందో చూడాలి. కాగా, ఈ మ్యాచ్‌కు టాలీవుడ్ అగ్రహీరో విక్టరీ వెంకటేశ్ కూడా హాజరయ్యారు. ఆయన క్రికెట్ ప్రేమికుడన్న సంగతి తెలిసిందే. ఇవాళ సన్ రైజర్స్ జెండా ఊపుతూ చిన్నస్వామి స్టేడియంలో ఉల్లాసంగా కనిపించారు.



# ఐపీఎల్ 19వ సీజన్ కు తెరలేచింది.. సన్‌రైజర్స్ పై టాస్ గెలిచిన ఆర్సీబీ



కోట్లాది మంది క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌కు ఘనంగా తెరలేచింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరుగుతున్న ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ కీలక మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్ మొదట బౌలింగ్ ఎంచుకున్నాడు. సొంతగడ్డపై హైదరాబాద్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు.టాస్ గెలిచిన అనంతరం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్ మాట్లాడుతూ.. “మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. గతేడాది నుంచి ఎన్నో సానుకూల అంశాలు ఉన్నప్పటికీ, ఈ కొత్త సీజన్‌లో మేం డిఫెండింగ్ ఛాంపియన్‌గా కాకుండా, మరోసారి టైటిల్ గెలవడానికే ప్రయత్నిస్తాం. మా జెర్సీపై రెండో స్టార్‌ను చేర్చేందుకు మా శక్తివంచన లేకుండా కృషి చేస్తాం. మా జట్టులో జాకబ్ డఫీ, అభినందన్ సింగ్ ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేస్తున్నారు” అని తెలిపాడు.మరోవైపు సన్‌రైజర్స్ తాత్కాలిక కెప్టెన్ ఇషాన్ కిషన్ మాట్లాడుతూ.. “పిచ్ ఫ్రెష్‌గా కనిపిస్తోంది. మొదట బ్యాటింగ్ చేసినా, బౌలింగ్ చేసినా పెద్ద తేడా ఉండదు. మేం కొత్తగా ఏమీ ప్రయత్నించాల్సిన అవసరం లేదు, మా ప్రణాళికలను సరిగ్గా అమలు చేస్తే చాలు. జట్టులోని ఆటగాళ్లంతా మంచి ఫామ్‌లో ఉన్నారు” అని ధీమా వ్యక్తం చేశాడు.ఇరు జట్ల వివరాలు:రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్, రజత్ పటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, అభినందన్ సింగ్, జాకబ్ డఫీ, సుయాష్ శర్మ.సన్‌రైజర్స్ హైదరాబాద్: అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్ (కెప్టెన్/వికెట్ కీపర్), హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, సలీల్ అరోరా, హర్ష్ దూబే, హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్, ఎషాన్ మలింగ. గత సీజన్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న ఆర్సీబీ ఈ సీజన్‌ను విజయంతో ప్రారంభించాలని పట్టుదలగా ఉండగా, సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా శుభారంభం చేయాలని ఉవ్విళ్లూరుతోంది. దీంతో తొలి మ్యాచ్‌లోనే అభిమానులకు హోరాహోరీ పోరు ఖాయంగా కనిపిస్తోంది.

# సన్‌రైజర్స్‌కు ఆదిలోనే షాక్.. ఒకే ఓవర్లో ఆ ఇద్దరూ ఔట్..

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ మొదటి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆదిలోనే కష్టాల్లో పడింది. ఆర్సీబీ పేసర్ జాకబ్ డఫ్ఫీ(3-17) విజృంభణతో స్వల్ప వ్యవధిలో మూడు బిగ్ వికెట్లు కోల్పోయింది. విధ్వంసక ఓపెనర్లు అభిషేక్ శర్మ(7), ట్రావిస్ హెడ్(11)లు ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చిన డఫ్ఫీ ఆ తర్వాతి ఓవర్లో నితీశ్ రెడ్డి(1)ని బోల్తా కొట్టించి ఆరెంజ్ ఆర్మీని ఒత్తిడిలో పడేశాడు. +వశీస్త్రతీఖుజూష్ట్రఅఎ =వటవతీవఅఎవ ఆరంభ పోరులో టాస్ ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. తొలి ఓవర్లో సిక్సర్‌తో అలరించిన అభిషేక్ శర్మ(7) దూకుడు పెంచే క్రమంలో టైమింగ్ కుదరక జాకబ్ డఫ్ఫీ(3-17) ఓవర్లో వెనుదిరిగాడు. చివరి బంతికి సిక్సర్ కొట్టే ప్రయత్నంలో ట్రావిస్ హెడ్(11) బౌండరీ లైన్ వద్ద సాల్ట్ చేతికి చిక్కాడు. దాంతో.. రెండు కీలక వికెట్లు కోల్పోయింది.అనంతరం కెప్టెన్ ఇషాన్ కిషన్(23 నాటౌట్) జతగా క్రీజులో నిలుస్తాడనుకున్న నితీశ్ రెడ్డి(1) సైతం తేలికగావికెట్ ఇచ్చేశాడు. డఫ్ఫీ బౌలింగ్‌లోనే పేలవ షాట్ ఆడి చేతికి చిక్కాడు. మూడు వికెట్లు పడిన వేళ అభినందన్ సింగ్ ఓవరో?్ల రెచ్చిపోయిన ఇషాన్ వరుసగా సిక్స్, ఫోర్, సిక్స్ బాదడంతో స్కోర్ 50కి చేరువైంది. పవర్ ప్లేలో 3 వికెట్ల నష్టానికి ఎస్ఆర్‌హెచ్ 49 పరుగులు చేసింది.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## ప్రభాస్ సినిమాలో రోల్.. విమర్శలపై స్పష్టత ఇచ్చిన నటి రాశి

ప్రభాస్ సినిమాలో నటించడంపై తాను చేసిన వ్యాఖ్యల గురించి సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై సీనియర్ నటి రాశి స్పందించారు. ప్రభాస్‌కు తల్లి పాత్రలో తప్ప మరే ఇతర పాత్రలోనైనా నటించడానికి సిద్ధమేనని, సోదరి పాత్ర చేయనని తాను చెప్పలేదని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'అనుమాన పక్షి' సినిమా ఈవెంట్‌లో ఆమె ఈ విషయంపై మాట్లాడారు.ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ప్రభాస్ అంటే ఇష్టమని, కానీ ఆయనకు తల్లిగా మాత్రం నటించనని రాశి చెప్పిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు రకరకాలుగా స్పందించడంతో ఆమె ఈ వివరణ ఇచ్చారు. ప్రభాస్ సినిమాలకు గతంలో డబ్బింగ్ చెప్పినా, ఆయన్ను కలవలేకపోయానని కూడా ఆమె గతంలో పేర్కొన్నారు.'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ దర్శకత్వంలో రాగ్ మయూర్ హీరోగా 'అనుమాన పక్షి' తెరకెక్కింది. ఈ చిత్రంలో తన పాత్ర గురించి వినగానే ఎలాంటి సందేహం లేకుండా ఒప్పుకున్నానని రాశి తెలిపారు. హీరోయిన్‌గా 148 సినిమాలు చేశానని, ఆ అనుభవంతో ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుంది ధీమాగా చెబుతున్నానన్నారు.



## వెంకటేశ్, కల్యాణ్‌రామ్‌తో అనిల్ రావిపూడి కొత్త సినిమా!

వరుస విజయాలతో దూసుకుపోతున్న స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి మరో క్రేజీ ప్రాజెక్టును ప్రకటించారు. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ హీరోలుగా ఒక భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'భగవంత్ కేసరి', 'మన శంకర వర ప్రసాద్ గారు' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత ఈ సంస్థ నిర్మిస్తున్న మరో భారీ చిత్రమిది. సురేశ్ ప్రొడక్షన్స్, అర్చన ఈ సినిమాను సమర్పిస్తుండగా, జీ స్టూడియోస్ సహ నిర్మాతగా వ్యవహరిస్తోంది. ఈ ప్రాజెక్టుకు తాత్కాలికంగా ఎువఅనివాూఅఅశ్రీ5, చచీఖ=ూ=2 అనే వర్కింగ్ టైటిల్స్ పెట్టారు.వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఇది ఐదో సినిమా కావడం విశేషం. వీరిద్దరి కలయికలో గతంలో వచ్చిన 'ఖీ2', 'ఖీ3', 'సంక్రాంతికి వస్తున్నాం', 'మీా+' వంటి చిత్రాలు బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. అలాగే, 'పటాస్' వంటి సూపర్ హిట్ తర్వాత కల్యాణ్ రామ్‌తో అనిల్ రావిపూడికి ఇది రెండో సినిమా. దీంతో ఈ కొత్త ప్రాజెక్టుపై అంచనాలు భారీగా పెరిగాయి.ఈ సినిమాను పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే పూజా కార్యక్రమాలతో సినిమాను లాంఛనంగా ప్రారంభించనున్నారు.





## "అల్లు అర్జున్ ఇంత గొప్ప డాన్సర్ కావడానికి నేనే కారణం": రాధిక ఫన్నీ కామెంట్స్

సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై చేసిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో నవ్వులు పూయిస్తున్నాయి. అల్లు అర్జున్ ఇంత గొప్ప డ్యాన్సర్ కావడానికి పరోక్షంగా తానే కారణమని ఆమె చమత్కరించారు. ప్రస్తుతం ఆమె న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్న ఒక డ్యాన్స్ రియాలిటీ షోలో ఈ ఆసక్తికర సంభాషణ జరిగింది.షోలో భాగంగా ఒక కంటెస్టెంట్ 'పుష్ప' సినిమాలోని పాటకు అద్భుతంగా డ్యాన్స్ చేశాడు. ఆ ప్రదర్శన చూసిన అనంతరం రాధిక మాట్లాడుతూ.. "అల్లు అర్జున్ అంత మంచి డ్యాన్సర్ అవ్వడానికి కారణం నేనే" అని అన్నారు. దీంతో అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయారు. దీనికి ఆమె వివరణ ఇస్తూ, "చాలా ఏళ్ల క్రితం గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో నేను ఒక సినిమా చేశాను. ఆ సినిమాలో ఒక చిన్న పిల్లాడిని ఎత్తుకుని రైల్వే ట్రాక్‌పై పరుగెత్తే సన్నివేశం ఉంది. ఆ అబ్బాయి ఎవరో కాదు, చిన్నప్పటి అల్లు అర్జున్. బన్నీని అలా ఎత్తుకుని డ్యాన్స్ ఎలా చేయాలో నేనే నేర్పించాను" అంటూ నవ్వుతూ పాత జ్ఞాపకాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం 'పుష్ప' చిత్రాలతో పాన్ ఇండియా స్టార్‌డమ్ అందుకున్న అల్లు అర్జున్, దర్శకుడు అట్లీతో ఒక భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఈ సమయంలో రాధిక చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అయ్యాయి. ఆమె చేసిన ఫన్నీ కామెంట్స్‌ను అల్లు అర్జున్ అభిమానులు కూడా సరదాగా ఆస్వాదిస్తూ షేర్ చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com